విద్యుత్ వ్యవస్థ పటిష్టం

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 12 : వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు పంపిణీ వ్యవస్థను పటిష్టపరిచామని ఆసిఫాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ వాసుదేవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడచిన 8 నెలల్లో కొత్తగా వివిధ సామర్థ్యం గల 76 ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చామని పేర్కొన్నారు. తద్వారా ఓవర్ లోడ్ భారం తగ్గిందని తెలిపారు. వేలాడుతున్న లైన్ల మధ్య స్తంభాలు ఏర్పాటు చేసి, సరిచేసినట్లు పేర్కొన్నారు. పశువులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెల ఎత్తు పెంపు ఎంతగానో దోహదపడుతున్నదని తెలిపారు. పాత లైన్లను మార్చి, 39,786 మీటర్ల లైన్లు వేశామని వెల్లడించారు. లోడ్ పెరిగే అవకాశం ఉన్న చోట్ల సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచామని వివరించారు.

సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 12 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 9వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా జడ్జి ఎంవీ రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ స్టేషన్లలోని బ్యాంకింగ్, ఫ్రీ లిటిగేషన్, సివిల్, క్రిమినల్, ఎలక్ట్రిసిటీ, భూవివాదాలు, వివాహ కేసులు, వాహనాల కేసులు, చిట్ ఫండ్ కేసులు పరిష్కారం కోసం లోక్ అదాలత్ వినియోగించుకోవాలని సూచించారు. ఈ క్రమంలో ఈ నెల 24వ తేదీన పోలీసు ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

200వ రోజుకు జాతీయ గీతాలాపన

బెల్లంపల్లి, ఆగస్టు 12 : జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో పోలీస్ శాఖ సహకారంతో బెల్లంపల్లిలో నిర్వహిస్తున్న నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమం సోమవారంతో 200వ రోజుకు చేరుకున్నది. ఈ ఏడాది జనవరి 26న ప్రారంభమైన ఈ కార్యక్రమం నిత్యం విజయవంతంగా కొనసాగుతూ 200వ రోజుకు చేరుకోవడంతో సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలతో పాటు, కార్యక్రమ నిర్వహణ కోసం ముఖ్య కూడళ్ల వద్ద బాధ్యతలు నిర్వర్తించే వారికి సేవా సమితి అధ్యక్షుడు సతీశ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన వారిని శాలువాతో సత్కరించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

రెబ్బెన, ఆగస్టు 12 : సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, విధినిర్వహణలో మృతిచెందిన వారికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఆ సంఘం మండలాధ్యక్షుడు వేముల సత్యనారాయణ డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మృతిచెందిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు మండల కేంద్రంలో సోమవారం నివాళులర్పించారు. ఎంఈవో వెంకటేశ్వరస్వామి, కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయరాణి దృష్టికి సమస్య తీసుకెళ్లారు. సీఆర్పీలు దేవేందర్, రాజేశ్, మహేశ్, సీసీవో భాగ్యలక్ష్మి, పీటీఐ శేఖర్, మెసెంజర్ రామయ్య ఉన్నారు.

దహెగాం, ఆగస్టు 12 : దహెగాంలో సమగ్ర శిక్ష యూనియన్ ఆధ్వర్యంలో చనిపోయిన ఉద్యోగులకు నివాళులర్పించారు. మృతిచెందిన వారికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించాలని ఆ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి పాశం రాజేశ్ డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు, వేతన పెంపు డిమాడ్లను పరిష్కరించాలని కోరారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 12 : జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు భోజన విరామ సమయంలో మృతిచెందిన వారి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ జిల్లా కోశాధికారి నగేశ్, ఎంఐ ఎస్ జిల్లా అధ్యక్షుడు గేడేకార్ సంతోష్, మండలాధ్యక్షుడు వెంకటరమణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, ఆగస్టు 12 : జైనూర్ కేజీబీవీలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పవార్ తుకారం ఆధ్వర్యంలో విధి నిర్వహణలో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షురాలు సుమలత, అధ్యక్షురాలు సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శి రవీందర్, కోశాధికారి జే తుకారం, సభ్యులు తదితరులున్నారు.

లక్షెట్టిపేటవాసికి జపాన్‌లో అవార్డు

లక్షెట్టిపేట, ఆగస్టు 12 : లక్షెట్టిపేట పట్టణానికి చెందిన మీ సేవ నిర్వాహకుడు ఉత్తూరి వినయ్.. జపాన్‌లో అక్కడి ప్రముఖుల చేతులమీదుగా అవార్డు అందుకునానడు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని బీట్‌బజార్‌కు చెందిన వినయ్.. మీ సేవ నడిపిస్తూ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ ఏజెంట్‌గా చేరాడు. పలువురి నుంచి హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు చేయించడంతో పాటు, దవాఖానల్లో చికిత్స పొందిన కస్టమర్లకు వెంటనే క్లెయిమ్ అయ్యేలా కృషిచేస్తూ కంపెనీలో పేరు ప్రఖ్యాతలు పొందాడు. యాజమాన్యం శనివారం జపాన్‌లో నిర్వహించిన సీఈవో క్లబ్ కన్వర్షన్ 2024-25అవార్డుల ఎంపిక కార్యక్రమంలో వినయ్ సుముఖత స్థానం సంపాధించడంతోపాటు, ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు.

నేత్ర వైద్య శిబిరం విజయవంతం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 12 : గర్మిల్ల లయన్స్ క్లబ్, హెల్పింగ్ హాండ్స్ మంచిర్యాల సీసీహెచ్ఎస్ 1992, మంచిర్యాల జిల్లా ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ మధుకర్ ఉదార నేత్ర వైద్యశాల రేకుర్తి కరీంనగర్ సౌజన్యంతో సోమవారం మంచిర్యాల పట్టణంలోని సీఎంఆర్ షాప్ వద్ద గల సుచిత్ర ఇన్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతంమైనట్లు నిర్వాహకులు తెలిపారు. 200 మందికి డా.లయన్ అభిషేక్, ఇలియాస్ కంటి పరీక్షలు చేశారు. 60 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు రాష్ట్ర ఆటో ప్రణాళికా సంఘం చైర్మన్ అండ్ గర్మిల్ల లయన్స్ క్లబ్ డైరెక్టర్ లయన్ గాజుల ముకేశ్ గౌడ్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గర్మిళ్ల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బల్లు శంకర్ లింగం, కార్యదర్శి వేముల ప్రవీణ్, జడ్‌సీ కొంకుముట్టి వెంకటేశ్వర్లు, డా. సుగుణాకర్ రెడ్డి, సద్దనపు రాంచందర్, మోదుంపురం వెంకటేశ్వర్, జిల్లా గౌరవాధ్యక్షుడు బెల్లంకొండ మురళీధర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట మధుకర్, చల్ల విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడిస్తాం'

కాసిపేట, ఆగస్టు 12 : కాసిపేట మండలంలోని తంగళ్లపల్లి గ్రామ సమస్యలు పరిష్కరించుకుంటే ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని బీజేపీ మండలాధ్యక్షుడు సూరం సంపత్ హెచ్చరించారు. తంగళ్లపల్లి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ కోనూర్ గ్రామ పంచాయతీలో సోమవారం నాయకులు, గ్రామస్తులతో కలిసి నిరసన తెలిపారు. ఎన్నికల సందర్భంగా తంగళ్లపల్లిలో రోడ్డు నిర్మిస్తామని ఎమ్మెల్యే వినోద్ హామీ ఇచ్చారని, వెంటనే రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పార్టీట తరపున క్యాంప్ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు. మండల ప్రధాన కార్యదర్శులు ప్రసన్న, బాలరాజ్, మండల ఉపాధ్యక్షుడు పెద్దపల్లి శంకర్, భాకి కిరణ్, బీజేవైఎం నాయకులు విష్ణువర్ధన్, మండలాధ్యక్షుడు తిరుపతి, నాయకులు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విలేకరుల అక్రమాలపై కఠిన చర్యలు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 12 : జిల్లాలో కొందరు జర్నలిస్టుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల డీసీపీ భాస్కర్ హెచ్చరించారు. మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. విలేకరుల పేరు చెప్పి విద్యాసంస్థలు, ఇతర సంస్థలకు ఫోన్‌లు చేసి, అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పలువుపై కేసులు నమోదు చేశామని తెలిపారు. జర్నలిస్టులు కానివారు బైకులు, కార్లపై ప్రెస్ స్టిక్కర్ వేసుకోవద్దని సూచించారు.

నకిలీ స్టాఫ్ రిపోర్టర్‌పై కేసు

జన్నారం, ఆగస్టు 12 : జన్నారం మండలం పొనకల్ జయరాణి ఇ/మీ పాఠశాల యజమాని శ్రీరాముల మధుసూదన్‌ను బెదిరించి డబ్బు డిమాండ్ చేసిన మంచిర్యాలకు చెదిన నకిలీ ప్రజాతంత్ర స్టాఫ్ రిపోటర్ రత్నం తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ప్రజాతంత్ర స్టాఫ్ రిపోర్టర్ పేరిట రత్నం తిరుపతి.. పాఠశాల యజమాని శ్రీరాముల మధుసూనద్‌కు ఫోన్ చేశాడు. పత్రిక వార్షికోత్సవం ఉన్నదని, రూ.5 వేలు డిమాండ్ చేశాడు. రూ.4 వేలు ఇస్తానని పాఠశాల యజమాని ఒప్పుకున్నాడు. సాయంత్రం వరకు ఓ నంబర్ పంపించి, ఫోన్‌పే చేయాలని తిరుపతి చెప్పాడు. అనంతరం పాఠశాల యజమాని తన మిత్రులకు ఫోన్ చేసి, ఆరా తీయగా, నకిలీ అని తేలింది. దీంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫిర్యాదుల తక్షణ పరిష్కారానికి చర్యలు

- కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాస రావు
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ
- ఎస్పీని కలిసిన అధికారులు

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 12 : ప్రజావాణిలో భాగంగా అందిన ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుకుంటామని కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీఈ శ్రీనివాస రావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్‌స్టేషన్ల ఎస్ఐ, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి, సమస్య స్థితి, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు నిర్భయంగా మూడో వ్యక్తి ప్రమేయం, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకావాలన్నారు. ప్రజలు తమ సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని పేర్కొన్నారు.

ఎస్పీని కలిసిన అధికారులు..

బదిలీపై జిల్లాకు వచ్చిన పలువురు పోలీసు ఉన్నతాధికారులు జిల్లా కార్యాలయంలో ఎస్పీని కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులు క్రమశిక్షణతో, బాధ్యతయుతంగా విధులు నిర్వర్తించాలని, ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండాలని వారికి ఎసీప సూచించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు..

విద్యార్థులు ర్యాగింగ్ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ర్యాగింగ్ అత్యంత అమానుష చర్య అని, తోటి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించడం, వారిని ఇబ్బందులకు గురి చేయడం మంచి లక్షణం కాదని తెలిపారు. కేసుల్లో ఇరుక్కుంటే బంగారు భవిష్యత్‌ను కోల్పోతారని సూచించారు. అన్ని విద్యాసంస్థల్లో పోలీసుల కళాజాత బృందం, షీ టీం బృందాల ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్, మహిళలపై నేరాలకు గల చట్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గంజాయి, మత్తు పదార్థాల నిర్మూళనపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పశువులను రోడ్లపైకి వదలవద్దు..

ఆవులు, బర్రెలు, ఇతర పశువులను యజమానులు రోడ్లపైకి వదలవద్దని ఎసీప సూచించారు. రాత్రుళ్లు రోడ్లపై సంచరించడం వల్ల

బాధితుల నుంచి ఫిర్యాదులను తీసుకుంటున్న ఎస్పీ డీవీ శ్రీనివాస రావు

ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మొబైల్ ఫోన్ల రికవరీలో పోలీసుల పనితీరు అభినందనీయం..

మొబైల్ ఫోన్ల రికవరీలో జిల్లా పోలీసుల పనితీరు అభినందనీయమని ఎస్పీ అన్నారు. 15 రోజుల్లో పోగొట్టుకున్న, పోయిన 30 మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసినట్లు తెలిపారు. జిల్లా పోలీసుల పనితీరుకు నిదర్శనమని అభినందించారు. ఎవరైనా సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లను కొనుగోలు చేస్తే దుకాణా యజమాని నుంచి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. దుకాణాల్లో తక్కువ ధరకు సెకండ్ హ్యాండ్ మొబైల్ వస్తున్నదని కొనుగోలు చేసి, దొంగిలించబడిందని తెలియక మోసపోతున్నారని పేర్కొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అత్యాశకు పోయి అనవసర లింకులను ఓపెన్ చేయవద్దని, ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలని తెలిపారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేసి గాని, సైబర్ క్రైమ్ https://www.cybercrime.gov.in లో గానీ ఫిర్యాదు చేయాలని సూచించారు. నేరం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే నష్టపోయిన సొమ్మును రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

నషా ముక్త్ భారత్ పకడ్బందీగా అమలు చేద్దాం

- కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 12 : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్ సాధనపై సమష్టిగా కృషి చేద్దామని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అధికారులకు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్‌తో కలిసి జిల్లా అధికారులతో నషా ముక్త్ భారత్ అభియాన్ అమలుపై దీపక్ తివారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగంపై జరుగుతున్న పోరాటంలో అందరం స్వచ్ఛందంగా పాల్గొని క్రియాశీల భాగస్వాములమవుతామని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, నష్టాలపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు.

ఓటరు జాబితా సిద్ధం చేయాలి..

పంచాయతీ ఎన్నికల దృష్ట్యా జిల్లా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. కలెక్టరేట్‌లో డీపీవో భిక్షపతితో కలిసి ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉపయోగించిన ఓటరు జాబితాను అనుసరించి పంచాయతీ ఎన్నికల ఓటరు జాబితా తయారుచేయాలని తెలిపారు. ఒకే కుటుంబంలో గల ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా జాబితా తయారుచేయాలని, మహిళలు, పురుషులు, ఇతర ఓటర్లను గుర్తించి, తప్పులు లేకుండా సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఓటరు జాబితాను వార్డులు, పంచాయతీల్లో ప్రచురించాలని సూచించారు. సమావేశంలో సంబంధిత అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ మహేంద్ర వర్ధంతి

మందమర్రి, ఆగస్టు 12 : ప్రపంచ కార్మిక సంఘాల అధ్యక్షుడు కేఎల్ మహేంద్ర 17వ వర్ధంతిని సోమవారం మందమర్రి ఏరియా జీఎం కార్యాలయ ఆవరణలో ఏఐటీయూసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, కేంద్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి, ఎండీ అక్బర్ అలీ, భీమనాథుని సుదర్శన్, తిరుపతి గౌడ్, ఇప్పకాయల లింగయ్య, గోపతి సత్యనారాయణ పాల్గొన్నారు.

రెబ్బెన, ఆగస్టు 12 : గోలేటిటౌన్‌షిప్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో కేఎల్ మహేంద్ర చిత్రపటానికి గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, నాయకులు పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, అనంద్, శేషు, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, సీపీఐ పట్టణ కార్యదర్శి మారం శ్రీనివాస్, పిట్ కార్యదర్శులు రామయ్య, అశోక్, గడ్డం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ గ్రంథాలయ దినోత్సవం

దండేపల్లి, ఆగస్టు 12 : గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో సోమవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధికి పాటు పడుతున్న దండేపల్లి లిటరసీ ఫెసిలేటర్ మహేశ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బొలిశెట్టి బుచ్చన్న, సిబ్బంది ఉన్నారు.

వర్షానికి కూలిన ఇంటి గోడలు

వేమనపల్లి, ఆగస్టు 12 : మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి దస్నాపూర్ గ్రామంలో మోర్ల జోగయ్యకు చెందిన ఇంటి గోడలు సోమవారం కూలిపోయాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ఉద్యోగులకు వీడ్కోలు

చెన్నూర్, ఆగస్టు 12 : చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో సోమవారం బదిలీపై వెళ్తున్న వైద్య సిబ్బందికి డాక్టర్లు, తోటి ఉద్యోగులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా దవాఖాన సూపరింటెండెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ.. బదిలీపై వెళ్తున్న పలువురు సిబ్బంది సుదీర్ఘకాలం దవఖానలో పని చేసి, రోగులకు మెరుగైన వైద్య సేవలందించారని కొనియాడారు. బదిలీపై వెళ్తున్న సిబ్బందిని దవాఖాన డాక్టర్లు, తోటి సిబ్బంది శాలువాలతో సన్మానించి, వీడ్కోలు పలికారు.

నేడు రైతులకు అవగాహన సదస్సు

పెంచికల్‌పేట్, ఆగస్టు 12 : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం చిరుధాన్యాల పంటల యజమాన్య సాగుపై హైదరాబాద్ నుంచి శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తారని ఏఈవో లావణ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఉదయం 9 గంటలకు హాజరవ్వాలని సూచించారు.

సర్దుబాటు ఉత్తర్వులు రద్దు చేయాలి

కాగజ్‌నగర్, ఆగస్టు 12 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఏటూకూరి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో వివిధ కేటగిరీల ఉపాధ్యాయ పోస్టులు 500 ఖాళీగా ఉండడంతో గతంలో జిల్లా విద్యాధికారి పాఠశాలలకు సర్దుబాటు ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఖాళీ పోస్టుల్లో ప్రభుత్వం ఎడ్యుకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లను నియమిస్తున్నదని, గతంలో ఇచ్చిన సర్దుబాటు ఉత్తర్వులు రద్దుచేసి ఎడ్యుకేషనల్ ఇన్‌స్ట్రక్టర్స్ నియామకాల నిబంధనలు విడుదల చేయాలని తెలిపారు.

కార్మికుల సంక్షేమానికి పాటుపడాలి

మందమర్రి, ఆగస్టు 12 : కార్మికుల సంక్షేమానికి పాటుపడాలని, ఉత్పత్తి రక్షణకు సహకారం అందిస్తామని హెచ్‌ఎంఎస్ నాయకులు అన్నారు. మందమర్రి జీఎం దేవేందర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కేంద్ర ఉపాధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి, కేంద్ర నాయకుడు వెల్ది సుదర్శన్, సంతోష్, నవీన్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం శుద్ధి

మందమర్రి రూరల్, ఆగస్టు 12 : మామిడి గట్టు గ్రామంలో బీజేపీ మండలాధ్యక్షుడు సుంకరి రాజేందర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాన్ని సోమవారం శుద్ధి చేశారు. చెన్నూరు కన్వీనర్ అక్కల రమేశ్, సీనియర్ నాయకులు డివీ దీక్షితులు, మండల ప్రధాన కార్యదర్శి జనార్ధన్, బూత్ అధ్యక్షుడు సుంకరి ప్రవీణ్‌కుమార్, దుర్గం రాజ్‌కుమార్, నాంపల్లి మధు, మారుతి, దర్శనాల గట్టయ్య, కోట తిరుపతి, వినయ్, వేల్పుల ప్రదీప్, అనపర్తి రాహుల్, కొత్తపెల్లి అశోక్ కుమార్, జోడి ప్రవీణ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

నెన్నెల, ఆగస్టు 12 : మండలంలోని జోగాపూర్ మాజీ సర్పంచ్ గడ్డం నవీన్‌గౌడ్ (37) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. కొత్తగా ఏర్పాటైన జోగాపూర్ పంచాయతీకి ప్రథమ సర్పంచగా బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎన్నికయ్యాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఆయన మృతిపై బీఆర్ఎస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

కోతులు, కుక్కల బెడద నివారించాలి

జన్నారం, అగస్టు 12 : మండలంలోని తిమ్మాపూర్‌లో కోతులు, కుక్కల బెడద నివారించాలని సోమవారం ప్రజావాణిలో ఆ గ్రామానికి చెందని రవిశంకర్, రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. కోతులు ఇండ్లలోకి చొరబడి ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు.

కాసిపేట, ఆగస్టు 12 : కాసిపేట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి భూ సమస్యకు సంబంధించి ఒక దరఖాస్తు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, తహసీల్దార్ భోజన్న, ఎంపీవో షేక్ సప్దర్ అలీ, వ్యవసాయాధికారి వందన, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, ఏపీవో నవీన్ కుమార్, విద్యాశాఖ సిబ్బంది శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

వేమనపల్లి, ఆగస్టు 12 : వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ రమేశ్, ఏపీఎం ఉమారాణి, వెటర్నరీ వైద్యుడు పవన్‌కుమార్, ఎమ్మార్సీ అశోక్ లచ్చన్న, రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి, ఆగస్టు 12 : కోటపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ముల్కల్ల సత్యనారాయణ రెడ్డి, ఏవో మహేందర్, ఎంఈవో తిరుపతి రెడ్డి, ఏపీవో బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ స్పాట్ కౌన్సెలింగ్

సీసీసీ నస్పూర్, ఆగస్టు 12: సీసీసీ నస్పూర్ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ కౌన్సెలింగ్ సోమవారం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఉదయం ప్రారంభమై, సాయంత్రం వరకు కొనసాగింది. తక్షణ ప్రవేశాల కోసం ఫస్టియర్‌లో ఆయా బ్రాంచ్‌లకు సంబంధించిన 107 సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించచారు. 69 మందికి సీట్లను భర్తీ చేశారు. ఎస్‌బీటీటీ చంద్రప్రసాద్, కళాశాల కరస్పాండెంట్ రాజేశ్వర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నారాయణమూర్తి, కళాశాల హెచ్‌వోడీలు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సీఐపై ఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 12 : హిందువుల మనోభావాలు దెబ్బ తీసేలా మాట్లాడిన కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబుపై చర్యలు తీసుకోవాలని స్థానిక బెంగాలీలు, భజరంగ్ దళ్ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు.

ఓటరు జాబితాపై సమావేశం

కాసిపేట, ఆగస్టు 12 : కాసిపేట ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఓటరు జాబితాపై పంచాయతీ కార్యదర్శులతో ఎంపీవో షేక్ సప్దర్ అలీ సమావేశం నిర్వహించారు. జాబితా తయారీపై అవగాహన కల్పించారు. సీనియర్ సహాయకులు ఏ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 12 : దహెగాం మండలం కర్జీ గ్రామానికి చెందిన డోబ్ రమాదేవికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు బెల్లంపల్లి దవాఖానకు తీసుకవచ్చారు. అక్కడి వైద్యులు పరీక్షించి, మంచిర్యాల మాతా శిశు దవాఖానకు రెఫెర్ చెశారు. 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా, మార్గమధ్యంలో నొప్పులు అధికమవడంతో వాహనాన్ని నిలిపి, ఈఎంటీ శహబాజ్ అధికారుల సలహాతో సుఖప్రసవం చేశారు. అడాబిడ్డకు జన్మనివ్వగా, మెరుగైన చికిత్స కోసం ఎంసీహెచ్‌కు తరలించారు. ఈఎంటీ శహబాజ్, పాయిలెట్ రంజిత్‌ను మంచిర్యాల జిల్లా కార్యనిర్వహణ అధికారి సంపత్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పోగ్రామ్ మేనేజర్ సామ్రాట్ అభినంధించారు.

అధికారుల సూచనలు పాటించాలి

వాంకిడి, ఆగస్టు 12 : రైతులు పంటల సస్యరక్షణలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. వాంకిడి మండలంలోని ఖమాన గ్రామంలో సోమవారం రైతు చెనులో అయిల్ పాం చెట్లు నాటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతులు ప్రభుత్వం ఇచ్చే రాయితీని సద్వినియోగం చేసుకొని, పంట సాగుచేయాలని సూచించారు. అనంతరం వాంకిడి మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి మిలింద్, ఏఈవో ఉన్నారు.

డీఆర్డీవోకు సన్మానం

కెరమెరి, ఆగస్టు 12 : కుమ్రం భీం ఆసిఫాబాద్ డీఆర్డీవోగా నియమితులైన దత్తారాంను ఆదివాసీ నాయకులు సోమవారం తన కార్యాలయంలో కలిసి సన్మానించారు. వారిలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్, కెరమెరి మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, యువజన సంఘం అధ్యక్షుడు పెందోర్ రాజేశ్వర్, మాజీ సర్పంచ్ తొడసం జగన్నాథ్‌రావ్, కొలాం సంఘం జిల్లా నాయకుడు సిడాం ధర్ము తదితరులున్నారు.

సమయపాలన పాటించాలి

కౌటాల, ఆగస్టు 12 : ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కౌటాల మండల నోడల్ అధికారి గావుడే హన్మంతు అన్నారు. విర్దండి మండల ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్, ఎన్ఏఎస్‌లో పాటించాల్సిన పద్ధతుల గురించి పలు సూచనలు చేశారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధచూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట సీఆర్పీ రవికుమార్ ఉన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్సీ జిల్లా అధ్యక్షుడిగా రాజేశ్

శ్రీరాంపూర్, ఆగస్టు 12 : నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్సీ) మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా ఆవుల రాజేశ్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు బద్దిపడిగ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ మొహమ్మద్ యాసిన్ నియామక పత్రాన్ని అందించారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా నియమించడంపై రాజేశ్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మానవ హక్కుల పరిరక్షణ, అవినీతి రహిత సమాజం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

నేడు పాత బస్టాండ్ వ్యాపారస్తుల బంద్

మందమర్రి, ఆగస్టు 12 : బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ దేవాలయాలపై దాడిని ఖండిస్తూ హిందువులకు మద్దతుగా మంగళవారం మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో వాణిజ్య, వ్యాపార దుకాణాల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంద్‌లో భాగంగా పాత బస్టాండ్ నుంచి పెట్రోల్ బంక్ వరకు శాంతియుత ర్యాలీ తీయనున్నట్లు పేర్కొన్నారు. వ్యాపారులు దుకాణాలను మూసివేసి, ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే రామకృష్ణాపూర్ పట్టణ బంద్ నిర్వహిస్తున్నట్లు బీజేపీ, హిందూ ఐక్య సంఘాల వేదిక నాయకులు తెలిపారు. వ్యాపార సంఘాలు, హోటళ్లు, ఆటో యూనియన్, రామకృష్ణాపూర్, గద్దరాగడిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని కోరారు.

జిల్లా కేంద్రంలో సదరం శిబిరం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 12 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో సోమవారం ఆర్థో విభాగానికి సంబంధించిన సదరం శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షల కోసం ఆన్‌లైన్ ద్వారా 50 మంది దరఖాస్తు చేసుకోగా, 41 మంది హాజరైనట్లు తెలిపారు. హెచ్‌వోడీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్థోపెడిక్ వైద్యుడు శ్రీధర్ వైద్యపరీక్షలు నిర్వహించారు. అర్హులైన వారికి త్వరలో వికలాంగుల ధ్రువీకరణ పత్రాలు రానున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 12 : మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల వారీగా సీఎస్‌సీ హెల్త్ కేర్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో ఫ్లెబోటమిస్ట్, ల్యాబ్ టెక్నిషన్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్ కొండల్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించే ఇంటర్వ్యూకు నిజ ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ సెట్‌తో హాజరవ్వాలని సూచించారు. వివరాలకు 99891 65691, 89777 76143 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

బెల్లంపల్లి, ఆగస్టు 12 : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటుగా పరిసరాల శుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత తెలిపారు. మున్సిపాలిటీ పరిధి 11వ వార్డులో సోమవారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కమిటీ సభ్యులు, జవాన్ ఇంద్రపాల్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనంపై కళాజాత

దండేపల్లి, ఆగస్టు 12 : దండేపల్లి మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు స్వచ్ఛధనం-పచ్చదనంపై కళాజాత నిర్వహించారు. కళాకారులు లావుడ్య రమేశ్, ముల్కల్ల మురళి, లచ్చన్న, పోశం, రవీందర్, శ్రీనివాస్, కిష్టయ్య, రాజా తిరుపతి, కృష్ణ, రవీందర్, సత్యనారాయణ, రాజేశ్, నాగలక్ష్మి, సంధ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

దండేపల్లి, ఆగస్టు 12 : వెల్గనూర్ మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఎమ్మార్సీ కారాయలయ సిబ్బందికి సోమవారం వినతి పత్రం అందించారు. 5 తరగతులకు కేవలం ఇద్దరు ఉపాధ్యాయులే ఉన్నారని పేర్కొన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి

కన్నెపల్లి, ఆగస్టు 12 : సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మనోహర్ పేర్కొన్నారు. సోమవారం మెట్‌పల్లిలో మాట్లాడారు. గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటల పాటు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు సిద్ధార్థ, మహేశ్, నగేశ్, అంజన్న, అశోక్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ఏర్పాటు చేసుకోవాలి

కోటపల్లి, ఆగస్టు 12 : హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు మంత్రి రామయ్య కోరారు. మండల కేంద్రంలో సోమవారం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ విద్యార్థులతో జాతీయ జెండాలు పట్టుకొని ర్యాలీ తీశారు. మండల ప్రధాన కార్యదర్శి కందుల వెంకటేశ్, ఏబీవీపీ రాష్ట్ర కమిటీ మెంబర్ శివకృష్ణ, సీనియర్ నాయకులు దుర్గం నర్సింహులు, కాశెట్టి రాకేశ్, కొడిపె మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, ఆగస్టు 12 : బీజేపీ మహిళా మోర్చా జిల్లా విభాగం ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా జాతీయ జెండాలు పట్టుకొని ర్యాలీ తీశారు. జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నాయకులు ఈర్ల విశ్వేశ్వర్, శివ, సిందం శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల (ఏసీసీ), ఆగస్టు 12 : పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు జోగుల శ్రీదేవి జనరల్ సెక్రటరీ వాణి శ్రీ, గోమాస కమల, పచ్చ స్వప్నరాణి, టౌన్ అధ్యక్షురాలు తిరుమల, లక్షెట్టిపేట మహిళా మోర్చా అధ్యక్షురాలు తోగటి పద్మ, దీప రాణి, సరస్వతి, సరిత, వసంత, భారతి, పద్మ, స్రవంతి, రమ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలపై అవగాహన

వాంకిడి, ఆగస్టు 12 : వాంకిడి సబ్ పోస్ట్‌మాస్టర్ అవినాష్ అధ్యక్షతన మండలంలోని చైపన్‌గూడలో సోమవారం తపాలా శాఖ సేవలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిర్పూర్ కాగజ్‌నగర్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సిరికొండ సతీశ్ హాజరై, పలు రకాల సేవల గురించి వివరించారు. మెయిల్ వర్స్‌సెల్ గణేశ్, తపాలా శాఖ(ఐపీపీబీ) మేనేజర్ సాగర్, బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు ఎంఏ లతీఫ్, రాజేశ్, వెంకటకుమార్, కార్యదర్శి, తపాలా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాప్య వైద్య శిబిరం

దహెగాం,ఆగస్టు 12 : మండలంలోని బీబ్రా గ్రామంలో ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం వృద్ధాప్య వైద్య శిబిరం నిర్వహించినట్లు వైద్యాధికారి రాజేందర్ తెలిపారు. 75 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశామన్నారు. ఈ శిబిరంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు తాండూర్‌లో శిబిరం

తాండూర్, ఆగస్టు 12 : తాండూర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఆయుష్ శాఖ, తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో వృద్ధాప్య వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కార్యదర్శి దివాకర్ తెలిపారు. 50 ఏళ్లు పైబడిన వారికి మోకాళ్ల నొప్పులు, రక్తపోటు, మధుమేహం మొదలైన సమస్యలకు ఉచితంగా చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. తాండూర్ గ్రామంలోని 50 ఏళ్లుపైబడిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యలను పరిష్కరించాలి

మందమర్రి, ఆగస్టు 12 : విశ్వబ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నాయకులు సోమవారం మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం సమర్పించారు. జిల్లాలోని విశ్వబ్రాహ్మణ కుల వృత్తి దారులకు 4వ కేటగిరీ విద్యుత్ మీటర్లను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు కస్తూరి శ్రీనాథ్ చారి, ప్రధాన కార్యదర్శి రావుల హరీశ్ చారి, కోశాధికారి గొల్లపల్లి రాజేందర్, నాయకులు నాగరాజు, వేమునూరి నరేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మందమర్రి, ఆగస్టు 12 : పాలవాగు సమీపంలో గల 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఏ రాజశేఖర్ సోమవారం తెలిపారు. సారంగపల్లి, శంకర్‌పల్లి, చిర్రకుంట, పొన్నారం, ఆదిల్‌పేట, వెంకటాపూర్ గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.